ఆంధ్రజ్యోతి




ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 28 ఏప్రిల్ 2024



'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం అభ్యర్థిత్వానికి పోటాపోటీ



- 2007 నుంచి నాలుగు పర్యాయాలు ఎగిరిన బీఆర్ఎస్ జెండా
- తెరపైకి సుందర్‌రాజ్, వాసుదేవరెడ్డి, రాకేష్‌రెడ్డి తదితరుల పేర్లు
- నేడు వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో
- అనంతరం ఎంపీ అభ్యర్థి గెలుపు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై చర్చించే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టు సాధించేందుకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను అభ్యర్థిగా ప్రకటించటంతో బీఆర్ఎస్ తమ అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టింది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర వరంగల్‌కు చేరుకోనుండగా.. సాయంత్రం నిర్వహించే రోడ్డు షో అనంతరం ఎంపీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక అంశాలపై కేసీఆర్ గులాబీ నేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నాలుగు పర్యాయాలుగా వరంగల్, నల్గొండ, ఖమ్మం స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్సీగా విజయం సాధిస్తూ వస్తున్నారు. అలా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని కాపాడుకోవాలని ఆ పార్టీ వ్యూహరచన చేస్తోంది. పోటీకి కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజన్, విలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డితో పలువురు ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. దీంతో కేసీఆర్ ఎమ్మెల్సీ టికెట్‌ను ఎవరికి ఖరారు చేస్తారనే ఉత్కంఠ శ్రేణుల్లో కనిపిస్తోంది.



'కంచుకోట'పై మరింత దృష్టి

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించే దిశగా బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. 2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా అప్పటి నుంచి జరిగిన నాలుగు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2007లో తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కపిలివాయి దిలీప్‌కుమార్ విజయం సాధించగా.. అప్పుడు రెండేళ్ల

» మిగతా 7వ పేజీలో..

ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్

వరంగల్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్‌దే..

నేటి కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయండి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కేసీఆర్ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నేతలు

రాంనగర్, ఏప్రిల్ 27: ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో ఉన్నందున శనివారం సాయంత్రం దయాకర్‌రావు, పార్టీ హనుమకొండ జిల్లా అధ్య క్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ కుడా చైర్మన్‌లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు సతీష్‌బాబు, నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని, వరంగల్ లోక్‌సభ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మచ్చలేని నాయకుడని ఆయన తెలిపారు. ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనను గమనించిన ప్రజలు.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని ఆ పార్టీ రాజకీయం చేస్తోందన్నారు. ఆ రెండు పార్టీల అభ్యర్థులు బీఆర్ఎస్‌కు ద్రోహం చేసి అవకాశాల కోసం పార్టీ మారారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నగరానికి వస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్‌రావు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. అవకాశవాదులు, ద్రోహులు మాత్రమే పార్టీని వీడారని తెలిపారు. నిఖార్సైన కేడర్ ప్రస్తుతం పార్టీకి అండగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలుకుతూ అండగా ఉంటామని హామీ ఇస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ రోడ్ షోకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'క్రీస్తుజ్యోతి'ప్రత్యేక ప్రార్థనలు

భారత రాష్ట్ర సమితి వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ క్రీస్తుజ్యోతి ప్రార్థన

» మిగతా 8వ పేజీలో...

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్



మేచరాజుపల్లిలో మాట్లాడుతున్న బలరాంనాయక్

నెల్లికుదురు, ఏప్రిల్ 27 : కేంద్రంలో 'హస్తం' పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తెలిపారు. మండలంలోని మేచరాజుపల్లిలో బలరాం నాయక్‌తో పాటు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు వేతనం రూ.400 చెల్లిస్తామన్నారు. యువన్యాయం, రైతున్యాయం, శ్రామికన్యాయం, సామాజిక న్యాయం వంటి పథకాలను ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. మేచరాజుపల్లికి బస్సు సౌకర్యం, రోడ్డు సౌకర్యం, కల్పిస్తామన్నారు. ఎస్సారెస్పీ కాలువ మరమ్మతులు చేపట్టి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, వలబోజు వెంకటేశ్వర్లు, వెలిశాల దేవేందర్, కురపాటి వెంకటేశ్వర్లు, డెగెల వెంకన్న, బలరాం, జంగవంశీ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మురళీ నాయక్

కేసముద్రం : ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్క కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ పిలుపునిచ్చారు. కేసముద్రం లక్ష్మీసాయిగార్డెన్‌లో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అధ్యక్షతన పార్లమెంటరీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు

» మిగతా 8వ పేజీలో...

30న రేగొండకు సీఎం రేవంత్

భారీ బహిరంగ సభకు హాజరు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వెల్లడి



వివరాలు 7లో..

షార్ట్‌సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న ఇల్లు

ములుగు, ఏప్రిల్ 27: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధమైన సంఘటన ములుగు మండలం కొత్తూరులో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 10గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో కస్తూరి లక్ష్మి, కస్తూరి ఐలేష్ ఇళ్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ కుటుంబాలు భయంతో బయటకు వచ్చాయి. గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అగ్నిప్రమాద బాధితులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తామన్నారు.యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, నాయకులు బొక్క సత్తిరెడ్డి, ఎమ్డీ.చాంద్‌పాషా, బండి శ్రీనివాస్, నల్లెల్ల భరత్, కుక్కల నాగరాజు, బండి మధు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తెలంగాణకు బద్ధ వ్యతిరేకి ప్రధాని మోదీ
- మతం, కులం తప్ప బీజేపీకి ఎజెండా ఏదీ?
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- మేడిగడ్డపై కేసీఆర్ తెలివితక్కువ వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్ చేయించిందే ఆయనే..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వరంగల్‌కు బీజేపీ చేసిందేమీ లేదు..



వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 27: పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ఏం చేసిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. విభజన హామీ చట్టంలో పొందుపరిచన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యతో కలిసి మీడియా సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, మందక్రిష్ణ మాదిగపై ఆయన పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లకు అత్యంత ప్రమాదమని శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు ఇప్పటికే పేట్రేగిపోయాయని పేర్కొన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఒక్క ప్రాజెక్టు రాలేదని శ్రీహరి విమర్శించారు. విభజన హామీ చట్టంలో పొందుపరిచన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా తీసుకురావాలని కోరితే విస్మరించారని మండిపడ్డారు. వరంగల్‌కు ట్రిపుల్ ఐటీ ఇతర ఉన్నత విద్యా సంస్థలను ఎందుకు తీసుకురాలేకపోయారని బీజేపీపై ప్రశ్నలు సంధించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

వరంగల్ ఉమ్మడి జిల్లా, నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీలు ఇచ్చారని శ్రీహరి గుర్తు చేశారు. ఈ నెల 24న మడికొండలో జరిగిన జనజాతర సభలో చేపట్టే అభివృద్ధిని వివరించారన్నారు. బీజేపీకి మతం, కులం తప్ప మరే అజెండా లేదన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ఒక విధానమే ఆ పార్టీకి కరువైందని, ఈ దశలో ప్రజలు ఆ పార్టీని ఆదరించబోరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు పార్టీ అభివృద్ధి అజెండాతో పాటు సొంత అభివృద్ధి ప్రణాళిక ఉందని ఒక స్పష్టమైన విజన్‌తో ప్రజలు ముందుకు వెళుతోందన్నారు. ఈ క్రమంలోనే ప్రజలు కావ్యను ఆదరిస్తున్నారని, ఎన్నికల్లో ఆమె గెలుపు ఖాయమని తేలిందని శ్రీహరి ధీమాగా చెప్పారు. డాక్టరు కడియం కావ్య కులం, ఇతర వ్యక్తిగత విషయాలపై కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. కావ్య నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఆమోదించిన విషయం గుర్తించాలన్నారు. అయినా కొందరు అజ్ఞానంతో విష ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అదే విధంగా తన కులం విషయంలోని ఫిర్యాదులపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ గతంలో తేల్చి చెప్పిందని వివరించారు.

తాను రూ.100 కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నట్లు మందకృష్ణ మాదిగా నిరూపిస్తే ఆ ధనాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని దళితులకు పంచి పెడతానని శ్రీహరి సవాల్ విసిరారు. మందకృష్ణ తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తారని, ఆయనకు దళిత జాతి పరిరక్షణలో నిజాయితీ లేదని విమర్శించారు. ఆయన చేపట్టిన సామాజిక ఉద్యమం ఎక్కడికెళ్లిందని ప్రశ్నించారు. దళిత జాతి ముసుగు తొలగించుకొని

» మిగతా 8వ పేజీలో...

మోదీ గెలుపు భారత్‌కు శ్రీరామరక్ష

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్

భద్రకాళి బండ్‌పై మార్నింగ్ వాక్



భద్రకాళి బండ్‌పై ఓటు అభ్యర్థిస్తున్న అరూరి రమేష్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గెలుపు భారత్‌కు శ్రీరామరక్ష అని, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తే దేశాన్ని పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడుకుంటాడని వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హనుమకొండ భద్రకాళి బండ్‌పై జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. దేశప్రయోజనాల కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ హయాంలో ఉగ్రదాడులకు తావులేకుండా టెర్రరిజంపై ఉక్కుపాదం మోపుతూ దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించేలా రక్షణ కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే ఈ 10 ఏళ్లలో దేశం అపారమైన పురోగతి సాధించిందన్నారు. 140 కోట్ల భారతీయుల ఆశలకు నమ్మకంగా ఎన్‌డీఏ ప్రభుత్వం నిలిచిందన్నారు. యువత విషయానికొస్తే స్వయం ఉపాధి కోసం పీఎం ముద్ర యోజన ద్వారా రుణాలు ఇచ్చారని, 7 ఐఐటీలు,

» మిగతా 8వ పేజీలో...

ఎండదెబ్బతో ఒకరి మృతి



సంఘటన స్థలంలో రాజు మృతదేహం

కొత్తపల్లిగోరి, ఏప్రిల్ 27: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. రేగొండ ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ఎండనూరి రాజు (35)కు కొత్తపల్లిగోరి మండలం దామరంచపల్లికి చెందిన లావణ్యతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల వల్ల కొంతకాలంగా లావణ్య పుట్టింట్లో ఉంటోంది. దీంతో రాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం సేవించి అత్తగారిల్లు దామరంచపల్లికి బయల్దేరాడు. తీవ్ర ఎండలో నడుచు కుంటూ రావడంతో వడదెబ్బకు గురై మృతి చెందాడు. చెన్నాపూర్‌లోని పెట్రోల్ వద్ద మృతదేహం ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తండ్రి ఎండనూరి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27 : హనుమకొండ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ డ్రైవర్ మునికుంట్ల దేవేందర్ శనివారం మధ్యాహ్నం సమయంలో బస్సు నడుపుకుంటూ బస్టాండ్‌లోకి వస్తుండగా ఎదురుగా బైకుపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌ను ఆపి గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు నర్సక్కపల్లికి చెందిన రంజిత్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రెడ్డికాలనీకి చెందిన వద్దూరి లింగయ్య(85).. పెద్దకొడుకు ఇంటి నుంచి శనివారం యాదవనగర్‌లో ఉంటున్న చిన్న కొడుకు శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. పెద్ద కుమారుడు రాజమౌళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' డైరెక్టర్ కనకదుర్గకు ఘన నివాళి



మడికొండలోని యూనిట్ కార్యాలయంలో కనకదుర్గ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

మడికొండ, ఏప్రిల్ 27 : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ మూడో వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా మడికొండలోని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అభ్యున్నతికి కనకదుర్గ చేసిన కృషిని వారు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి కె.రాజేశ్, బ్యూరో ఇన్‌చార్జి తడక రాజనారాయణ, ఏడీవీటీ ఇన్‌చార్జి విజేందర్‌రెడ్డి, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రి, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

30న రేగొండకు సీఎం రేవంత్

- భారీ బహిరంగ సభకు హాజరు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30వ తేదీన భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పరకాల, భూపాలపల్లి రెండు నియోజకవర్గాల స్థాయిలో ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సభను విజయవంతం చేయడం కోసం నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే హామీలను అమలులోకి తీసుకొచ్చామన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం నియోజకవర్గంలోని ఇండ్లులేని నిరుపేద కుటుంబాలకు భూములు కొనిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలను వంచించాయని సత్యనారాయణరావు అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన బీజేపీ ఆ ఊసే మరిచిందన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను తీసుకురావాలని కుట్ర పన్నిందన్నారు. ఈ క్రమంలో వందలాది మంది రైతుల మృతికి కారకులయ్యారన్నారు. శవాలపై పేలాలు ఏరుకునే విధంగా జీఎస్టీ పన్నులు వసూలు చేస్తుందన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే కుట్ర చేస్తుందన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇంటికో ఉద్యోగం ఇస్తా అని, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య ఇలా అనేక హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రాం నర్సింహారెడ్డి, దేవన్, కొమురయ్య, రామ్‌చంద్రయ్య, శ్రీనివాస్, తోట రంజిత్, సంతోష్ రాజిరెడ్డి, రమేష్, భార్గవ్, శ్రీరాములు పాల్గొన్నారు.

'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కాలపరిమితి ఉండటంతో 2009లో మరోసారి ఎన్నికలు జరిగాయి. రెండోసారి కూడా కపిలవాయి దిలీప్‌కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2015, 2021లో జరిగిన ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో శాసన మండలిలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం 17ఏళ్లుగా బీఆర్ఎస్ ఆధీనంలోనే ఉంది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరంగల్ జిల్లా వాసి అయినప్పటికి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉన్న వామపక్షవాదులు మద్దతుగా నిలవడంతో పల్లా గెలుపు సులువయిందనే చర్చ జరుగుతోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందటం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు పెరగడంతో గులాబీ పార్టీ కాస్త బలహీన పడిందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు పట్టభద్రుల స్థానం కూడా బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి అండగా నిలిచిన వరంగల్‌లో ఎంపీ సీటుతో పాటు ఎమ్మెల్సీ స్థానాన్ని కాపాడుకోవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది.

తెరపైకి ఉద్యమ నేతలు..

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం నుంచి పోటీకి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు, సీనియర్ నేతలు క్యూ కడుతున్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను బరిలో దించింది. 2021 మార్చి 14న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న స్వతంత్రుడిగా బరిలో దిగి ద్వితీయ స్థానంలో నిలిచిన ఆయన బీసీ సామాజిక వర్గం నేత కావటంతో పాటు కాంగ్రెస్ టికెట్ దక్కటంతో గులాబీ పార్టీ గట్టి అభ్యర్థి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అయితే అధికార పార్టీలో ఉన్న తీన్మార్ మల్లన్నను ఢీ కొట్టే నేత ఎవరనే చర్చ బీఆర్ఎస్‌లోజరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం వరంగల్‌లో రోడ్ నిర్వహించనున్నారు. ఈ రోడ్ షో అనంతరం అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు సమాచారం. వరంగల్ ఎంపీ స్థానంలో ఓప్రవేటు సర్వేలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా రిపోర్టు వచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సర్వే రిపోర్టు గురించి వివరించడంతో పాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై నేతలు కేసీఆర్‌తో చర్చించే అవకాశమున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు నేతలు ఉత్సాహంతో ఉన్నారు. ప్రధానంగా వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి ఎమ్మెల్సీ టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వాసుదేవరెడ్డికి.. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డి కూడా ఉప ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారని, ఆయనకు పార్టీలో చేరినప్పుడే అనేక హామీలు ఇచ్చారని, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోవటంతో రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఉపఎన్నికల బరిలో నిలపాలని పార్టీలోని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏబీవీపీ నుంచి వచ్చిన రాకేష్‌రెడ్డి బరిలో ఉంటే విద్యార్థి సంఘం నుంచి కూడా కొంత మద్దతు లభిస్తుందని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం భావిస్తోంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బాహాటంగానే రాకేష్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అలాగే పలు విద్యా సంస్థల అధిపతిగా ఉన్న మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజు కూడా ఎమ్మెల్సీ టికెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. 2వేల మందికిపైగా ఉన్న విద్యాసంస్థల అధ్యాపకులు సుందర్‌రాజుకు మద్దతు ఇస్తారని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం అంచనా వేస్తోంది. సుందర్‌రాజు ఉద్యమకారుడిగా పనిచేసిన క్రమంలో మూడు ఉమ్మడి జిల్లాల్లోని వారితో సత్సంబధాలు ఉన్నాయని చెబుతున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సుందర్‌రాజుకు మద్దతుగా ఉన్నారు. అయితే అధిష్ఠానం వీరి పేర్లను పరిశీలిస్తునే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు గట్టి పోటీ ఇవ్వగల నేతలు ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో యోచిస్తున్నట్టు సమాచారం. నల్గొండ జిల్లాకు చెందిన తీన్మార్ మల్లన్నకు పోటీగా వరంగల్ నేతనే బరిలో దించుతారనే ప్రచారం జరుగుతుండగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బరిలో దించితే ఉప ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వవచ్చుననే చర్చ పార్టీలో జరుగుతుంది. అయితే పోటీకి ఎర్రబెల్లి సుముఖత వ్యక్తం చేస్తారా? ఆయన కాదంటే మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పేరును కూడా పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు ఇద్దరు ముగ్గురు సీనియర్ నేతల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో.. ఎవరిని అభ్యర్థిగా బరిలో దించుతారోననే ఉత్కంఠ గులాబీ శ్రేణుల్లో నెలకొంది.

బీఆర్ఎస్‌కు సవాల్‌గా ఉప ఎన్నిక

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నిక బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారుతోంది. గత నాలుగు పర్యాయాలు విజయం సాధించిన ఎమ్మెల్సీ స్థానాన్ని ప్రస్తుతం కాపాడుకోవటం అంతా సులువు కాదనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. అంతేకాకుండా ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారు. దీంతోపాటు గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గట్టిపోటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు సార్లు గెలిచిన స్థానంలో పట్టు నిలుపుకోవటం బీఆర్ఎస్‌కు సవాల్‌గానే మారిందన్న చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు కూడా పట్టభద్రులు కావటంతో బీఆర్ఎస్‌కు మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవటమే ఇబ్బందిగా మారగా, ఎమ్మెల్సీ ఉపఎన్నిక మరింతసవాల్‌గా మారిందనేచర్చ జరుగుతోంది.

గత ఎన్నికల్లో అభ్యర్థులకు పోలైన ఓట్లు

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు
పల్లా రాజేశ్వర్‌రెడ్డి	బీఆర్ఎస్	1,11,190
తీన్మార్ మల్లన్న	స్వతంత్ర	83,629
కోదండరామ్	టీజేఎస్	70,472
జి.ప్రేమేందర్‌రెడి	బీజేపీ	39,268
రాములునాయక్	కాంగ్రెస్	27,713
జయసారథిరెడ్డి	సీపీఐ	8,732

నోటా అంటే?



శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ సారి వినిపించే మాటా 'నోటా'. అంటే పైన ఏదీ లేదు అని అర్థం. పోటీ చేసే అభ్యర్థులందరికీ తిరస్కరణ ఓటును అధికారికంగా నమోదు చేయడానికి ఓటరును అనుమతించే ఎంపిక. ఓటరు నోటా మీటను నొక్కాలని ఎంచుకుంటే, ఆ ఓటరు ఏ పార్టీకి ఓటు వేయలేదని సూచిస్తుంది. 2013 సెప్టెంబరు 27న ఎన్నికల్లో 'పైన ఏదీ లేని' ఓటును నమోదు చేసుకునే హక్కును వర్తింపజేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అదేసమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో బటన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఓటర్లు నోటాను వినియోగించుకునేందుకు వీలుగా 'నన్ ఆఫ్ ది ఏబౌ' ఎంపిక కోసం ఈసీఐ ప్రత్యేక గుర్తును ప్రవేశపెట్టింది. ఈ గుర్తు అన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లలో (ఈవీఎంలు) చివరి ప్యానెల్‌లో కనిపిస్తుంది. నోటా ఎంపిక ప్రధాన లక్ష్యం ఏమిటంటే అభ్యర్థులెవరికి ఓటు వేయకూడదనుకునే ఓటర్లు తమ నిర్ణయం గోప్యతను ఎవరూ ఉల్లంఘించకుండా తిరస్కరించే హక్కును వినియోగించుకునేలా చేయడం. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటు వేయడానికి అర్హులు కాదని భావించినట్లయితే ఓటరు తప్పనిసరిగా తిరస్కరణ ఓటును నమోదు చేయడానికి అర్హత కలిగి ఉండాలి. పౌరులందరికీ ఇచ్చిన ఓటు హక్కు తప్పనిసరిగా అసమ్మతి ఓటును అనుమతించాలి.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

మూడు రకాల ఎన్నికలు


- సాధారణ, ఉప, మధ్యంతర ఎన్నికలు

సాధారణ ఎన్నికలు: ఒక ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలను సాధారణ, సార్వత్రిక ఎన్నికలు అంటారు.

ఉప ఎన్నికలు: ఐదేళ్ల మధ్య కాలంలో లోక్‌సభలోగానీ, విధానసభలోగానీ సభ్యుడు రాజీనామా చేయడం, లేదా చనిపోవడం తదితర కారణాల వల్ల ఏ నియోజకవర్గమైన ఖాళీ అయితే అక్కడ నిర్వహించే ఎన్నికను ఉప ఎన్నిక అంటారు.

మధ్యంతర ఎన్నికలు: ఐదేళ్ల కాలపరిమితి ముగియక ముందే మధ్యలో అసెంబ్లీగానీ, లోక్‌సభలోగానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మెజారిటీ కోల్పోతే నిర్వహించే ఎన్నికలను మధ్యంతర ఎన్నికలంటారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)



కొత్తగా ఓటరు గైడ్

- పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రయత్నం
- ఓటరు గైడ్ పంపిణీకి సిద్ధం

మట్టెవాడ(వరంగల్), ఏప్రిల్ 27: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ అధికారులు వినూత్న ఆలోచనలు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. మహిళా సంఘాల సభ్యులతో, మెప్మా ఆర్‌పీలతో ఓటరు చైతన్య సదస్సులు, విద్యార్థులు, యువతి, యువకులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం, ఓటు హక్కు వినియోగించడంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటర్లందరు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేసే విధంగా వివిధ రూపాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సౌకర్యార్థం పలు యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు గైడ్ ను తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ తాజాగా ఓటరు గైడ్ పేరిట బుక్‌లెట్ విడుదల చేసింది. బూత్‌లెవల్ ఆఫీసర్ ద్వారా ప్రతీ ఇంటికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రద్దీ ప్రాంతాల్లో ఓటరు గైడ్‌ను బుక్‌లెట్లను పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ఈ గైడ్‌లో ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వరకు సమగ్ర వివరాలను ఈ గైడ్‌లో పొందుపర్చారు.

ఓటరుకు ఉపయుక్తం ఓటరు గైడ్

ఓటు నమోదు నుంచి నామినేషన్ వరకు అన్ని వివరాలు ఈ ఓటరు గైడ్‌లో ఉండాలి. నూతన సాంకేతిక సహాయంతో ఎన్నికల కమిషన్ సేవలను ఓటర్లకు చేరవేస్తుంది. ఓటు నమోదు మొదలుకొని నామినేషన్ల వరకు ప్రతీది ఓటర్లు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా చూసుకోవచ్చు. దీనికోసం పలు యాప్‌లను తీసుకొచ్చారు. వీటి గురించి ఓటరు గైడ్‌లో వివరించారు. వివిధ యాప్‌లు వాటి పనితీరు, ఓటరు ప్రతిజ్ఞ తదితర అంశాలను గైడ్ బుక్‌లో పొందుపర్చారు. అంతేగాకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సిబ్బంది, ఓటు హక్కు వినియోగం, ఈవీఎం యంత్రాల పనితీరు, వీవీ ప్యాట్‌లలో ఓటు నమోదు వివరాలు ఇలా ప్రతీ అంశంతో కూడిన ఓటింగ్ ప్రక్రియను సులువుగా తెలుసుకునేందుకు గైడ్‌ను ముద్రించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి. సీ-విజిల్ యాప్ వివరాలు, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నో యువర్ క్యాండెట్ యాప్, ఓటు వేసే విధానం, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ స్టేషన్ వివరాలు ఈ సందేశాత్మకమైన ఓటరు గైడ్ బుక్‌లెట్ ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు. బీఎల్‌వోల ద్వారా ఈ బుక్‌లెట్‌లను మొదటిసారిగా ఓటుహక్కు వినియోగించుకునే యువతి, యువకులకు అందజేయాలని నిర్ణయించారు.

చైతన్య వంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటరు అప్రమత్తత, పరిశీలన, నిజాయితీ గల ఓటరు అనే నినాదాలతో ఈ బుక్‌లెట్‌ను రూపొందించారు. సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) బృందాలు ఫ్లెక్సీలు బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్నారు.

నేడు వరంగల్‌కు కేసీఆర్

- సాయంత్రం నగరంలో రోడ్‌షో
- సభకు హాజరుకానున్న 90వేల మంది



రాంనగర్, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వరంగల్ నగరానికి వస్తున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ తరపున హనుమకొండలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు నగరానికి చేరుకునే కేసీఆర్.. నేరుగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసానికి చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం జిల్లా నేతలతో కలిసి బస్సులో అదాలత్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, పెట్రోల్ పంపు జంక్షన్ మీదుగా హనుమకొండ చౌరస్తాకు చేరుకుంటారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సభకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి దాదాపు 90వేల మందిని తరలించేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్ షోకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కేసీఆర్ రోడ్ షోకు సంబంధించి హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణ చేస్తున్నారు. సభను విజయవంతం చేసి బీఆర్ఎస్ సత్తా చాటేందుకు నేతలు కసరత్తు చేస్తున్నారు. కాగా, రోడ్ షో అనంతరం రాత్రి కెప్టెన్ నివాసంలో బస చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వెళతారు.

నామినేషన్ల ఉపసంహరణకు రేపటితో గడువు పూర్తి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ నియోజకవర్గ నామినేషన్ల ప్రక్రియలో ఉపసంహరణల అంకానికి సోమవారంతో గడువు ముగియనుంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తవగా.. వరంగల్ నియోజకవర్గంలో పది, మహబూబాబాద్‌లో ఐదుగురి నామినేషన్ల తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియకు అవకాశం ఉండగా.. శనివారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. ఆదివారం సెలవు కాగా సోమవారం ఈ ఉపసంహరణ ప్రక్రియకు గడువు పూర్తవనుంది. సోమవారం ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రెండు నియోజకవర్గాల్లోనూ బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాపై స్పష్టత రానుంది. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరగ్గా.. వరంగల్ లోక్‌సభ స్థానానికి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 58 మంది నామినేషన్లు వేయగా పలు కారణాలతో పది మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 48 మంది బరిలో నిలిచారు. ఇక మహబూబాబాద్ పరిధిలో మొత్తం 30 మంది నామినేషన్లు వేయగా ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 25 మంది అభ్యర్థులు మిగిలారు. ఇక 29న ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత వీరిలో ఎవరుబరిలో నిలుస్తారో తేలనుంది.

బీఆర్ఎస్‌ను వీడేదిలేదు..

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, ఏప్రిల్ 27 : తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి తన రాజకీయ గురువని, ఆయన తనను సొంత కొడుకులా చూసుకున్నాడని గుర్తుచేశారు. ఆయన కుమారుడికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం ఎంపీ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ఖమ్మం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశానే తప్ప.. తమ మధ్య ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదగడంలో సురేందర్‌రెడ్డి పాత్ర కీలకమన్నారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన తనకు వెన్నుదన్నుగా ఉన్నాడని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మంచి సంబంధాలున్నాయని, అందులో తప్పేముందన్నారు. మర్యాదపూర్వకంగా కలిసినంత మాత్రాన పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదని చెప్పారు.

ఒడిదుడుకులు బీఆర్‌ఎస్‌కు కొత్తేమీ కాదు..

తెలంగాణ కోసమే పార్టీ పుట్టింది

మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత



బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలో ఎంపీ కవిత, నాయకులు

ములుగు, ఏప్రిల్ 27: తెలంగాణ కోసమే బీఆర్‌ఎస్ ఆవిర్భవించిందని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. ఉద్యమాలతో పురుడుపోసుకున్న పార్టీకి ఒడిదుడుకులు కొత్తకాదన్నారు. బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ములుగులో ఘనంగా జరిగింది. పార్టీ జిల్లా కార్యాలయం ఆవరణలో అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు జెండాను ఎగురవేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ సాధనలో బీఆర్‌ఎస్ శ్రేణులు భాగస్వాములు అయినట్లే రాష్ట్ర పునర్‌నిర్మాణ పోరాటంలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, జిల్లా నాయకులు పోరిక గోవింద్‌నాయక్, గండ్రకోట సుధీర్ యాదవ్, ములుగు పట్టణాధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీ దేవరనేని స్వామిరావు, నాయకులు సమ్మయ్య, అశోక్, రమణాచారి, ముడుతనపల్లి మోహన్, వేల్పూరి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతులకు కష్టాలు

వెంకటాపురం(నూగూరు): కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయని మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ, మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మండల కేంద్రంలో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రైతుబంధు డబ్బులు రావడంలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతోందని, ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని ఓటు వేయించుకుని మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, పోరిక గోవింద్‌నాయక్, గంపా రాంబాబు, అట్టం సత్యనారాయణ, గుడవర్తి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత పార్టీని నమ్మొద్దు

కన్నాయిగూడెం: మోసపూరి హామీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్‌ను రైతులు, ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబుతో కలిసి ఆమె హాజరయ్యారు. వరి పంటకు రూ. 500 బోనస్ ఇస్తామని, పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ. లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాన్ని విస్మరించిందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ దొంగ హామీలు ఇచ్చి లబ్ధిపొందాలని చూస్తోందని, ఆ పార్టీని ఎవరూ నమ్మొద్దని అన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఏప్రిల్ 27: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దావు వినోద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. 12 మంది ఎంపీటీసీ సభ్యులకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన మేర మోటార్లు వేయించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బోరుబావులు కిరాయి తీసుకుని ప్రజలకు తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనీల్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ రంజిత్‌ను ఆదేశించారు. మండలంలోని చల్లగరిగ- రేగొండ మండలం కోటంచ నైన్‌పాక నుంచి భూపాలపల్లి మండలం నేరేడుపల్లి వరకు బీటీ రోడ్డు మంజూరు చేయించి నాలుగు నెలలు గడిచినా రీటెండర్ల పేరుతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేయించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలకు తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించాలన్నారు. జడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ మొహియొద్దీన్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏంపీవో రామకృష్ణ, ఏపీఎం మంజూల, ఏఈలు అనిల్‌కుమార్, తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

రేగొండ : మండల కేంద్రంలో ఈనెల 30న నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బహిరంగ సభ ఏర్పాట్ల కోసం మండల కేంద్రలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వెనక ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్, పార్కింగ్‌ను పకడ్బందీగా పర్యవేక్షించాలని సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రవికుమార్‌కు సూచించారు. ఆయన వెంట పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా అధ్యక్షు డు ఐత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎస్‌ఎస్‌ఆర్ సంపత్‌రావు, ఎంపీపీ పున్నం లక్ష్మి, జడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మోదీ గెలుపు భారత్‌కు శ్రీరామరక్ష

(5వపేజీ తరువాయి)

16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్, 315 మెడికల్ కళాశాలలు, 390 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. పీఎం కౌశల్ వికాస్ యోజన కింద నైపుణ్య శిక్షణ ఇచ్చారన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ మారిందన్నారు. ప్రపంచాన్ని కరోనా వణికిస్తున్న సమయంలో సుమారు 100 దేశాలకు భారత్ నుంచి టీకాలను, మందులను అందించి ప్రాణాలు పోసిందన్నారు. దేశంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని 2020 నుంచి ఉచితం బియ్యం అందిస్తోందని, మరో ఐదేళ్ల ఉచితంగా రేషన్ బియ్యం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసి ఉంచారన్నారు. వరంగల్ నుంచి తనను లోక్‌సభకు పంపిస్తే మోదీని ఒప్పించి వరంగల్‌ను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అరూరి రమేష్ హామీ ఇచ్చారు.



భద్రకాళి బండ్‌పై ఓటు అభ్యర్థిస్తున్న అరూరి రమేష్

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్, వరంగల్ తూర్పు ఇన్‌చార్జి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావుల కిషన్, గాడిపల్లి రాజేశ్వర్, 31వ డివిజన్ అధ్యక్షుడు కడవేరు శ్రీనివాస్, 30వ డివిజన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నర్మెట్ట శ్రీనువాస్, అరణ్యరెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. పంచాయతీరాజ్, వైద్యఆరోగ్యశాఖ, సంక్షేమశాఖల అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన శనివారం సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని 317 బూత్‌లలో ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన సౌకర్యాలను తహసీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్, ఫ్యాన్లను ఏర్పాటు చేయడంతో పాటు వికాలంగుల కోసం వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతోపాటు మొబైల్ అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలన్నారు.. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి 14 రకాల వస్తువులతో ఒక ప్రత్యేకమైన వైద్య కిట్ అందించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. గర్భస్థ లింగ నిర్ధారణ చర్యలపై జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావుతో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు చేసే కేంద్రాలపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేట్టు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో ఫాం- ఎఫ్ రికార్డుల నిర్ధారణ, ఆన్‌లైన్ నమోదును పరిశీలించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్‌ను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శ్రీదేవి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి'

మల్హర్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ శ్రేణులు గెలిపించుకోవాలని మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి వాల రమణరావు కోరారు. మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ఉన్న కాంగ్రెస్ అధికారం కోసం పాకులాడుతున్నాయని, ప్రజలకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కృషి చేసింది కేసీఆర్ మాత్రమేన న్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామారావు, నాయకులు వాల యాదిగిరిరావు, తాజొద్దీన్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ



మృతదేహాన్ని సందర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కాటారం, ఏప్రిల్ 27: మండలంలోని ధన్వాడ గ్రామానికి చెందిన ఆత్కూరి మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. శుక్రవారం అర్ధరాత్రి మహదేవపూర్ సామాజిక ఆస్పత్రిలో మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మహదేవపూర్ ఎంపీపీ రాణిబాయి, కాంగ్రెస్ నాయకులు బోడ నరేష్, చీటూరి మహేష్ తదితరులు ఉన్నారు.

నార్లాపూర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

మేడారం, ఏప్రిల్ 27 : తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ మేకల మహేందర్ హాజరయ్యారు. ప్రజలకు ఉచిత న్యాయం, కుటుంబ తాగదాలు, రైతుల సాగు చట్టాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కక్షిదారులు ఉచితంగా న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ రాచర్ల రాజ్‌కుమార్, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది తదితరులు పాలొన్నారు.

అటవీ శాఖ ఉద్యోగులకు మెమో?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకతీయఖని, ఏప్రిల్ 27: విధులకు సకాలంలో హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అటవీశాఖ ఉద్యోగులపై జిల్లా ఉన్నత అధికారి సీరియస్ అయినట్లు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనంపై స్పందించినట్టు తెలుస్తోంది. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేషన్ అధికారికి జిల్లా అటవీశాఖ అధికారి వసంత మెమో జారీ చేసినట్లు సమాచారం.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 27: మండలంలోని బెస్తగూడెం గ్రామంలో శనివారం చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరంలో యూత్ సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని 11 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. అనంతరం రక్తదాతలకు సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాష్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ సభ్యులు జనగాం ప్రభాకర్, అభినయ్, పవన్, సంతోష్, అనిల్, వెంకటేశ్, ప్రశాంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బలరాంను విమర్శించే అర్హత కవితకు లేదు : కాంగ్రెస్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 27: మహబూబాబాద్ మాజీ ఎంపీ, కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్‌ను విమర్శించే అర్హత ప్రస్తుత ఎంపీ మాలోత్ కవితకు లేదని, ఓటమి భయంతోనే ఆమె అవాకులు చెవాకులు పలుకుతున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ విమర్శించారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలోత్ కవిత ఎంపీగా గెలిచి ములుగు నియోజకవర్గంలో తట్టెడు మట్టి పోసిన పాపానపోలేదని వ్యాఖ్యానించారు. ఎలాంటి అభివృద్ధి చేపట్టలేనివారు కాంగ్రెస్ అభ్యర్థిని విమర్శిస్తారా..? అని ప్రశ్నించారు.

విమర్శిస్తే పుట్టగతులు ఉండవ్ : ఎస్టీ సెల్

మంగపేట: మాజీ ఎంపీ బలరాం నాయక్‌పై ఎంపీ కవిత అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పెట్టిన భిక్షతో రాజకీయాల్లోకి వచ్చిన కవిత, ఆమె తండ్రి పార్టీని విమర్శించడం నీచ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఎంపీగా కవిత చేసిన అవృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మైల జయరామిరెడ్డి, కారుపోతుల నర్సయ్యగౌడ్, జిల్లా అనుబంధ సంఘాల జిల్లా నాయకులు టి. భగవాన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 27: భూపాలపల్లి మండలంలోని పెద్దకుంటపల్లి గ్రామంలో డీటీఎఫ్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాడులు చేపట్టి ఇద్దరు వ్యక్తుల నుంచి 30 లీటర్ల గుడుంబా, 50 కేజీల పంచదార, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 3500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు రమ్యరెడ్డి, రాజసమ్మయ్య, ఎస్సై రబ్బాని, సిబ్బంది రఘుపతి, కృష్ణ, శ్రీకాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేలిపోయిన పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్

కాటారం, ఏప్రిల్ 27: మండల కేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఆకస్మాత్తుగా పీటీ (పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్) పేలిపోయింది. భారీగా మంటలు లేవడంతో విద్యుత్ సిబ్బంది సబ్‌స్టేషన్‌లో సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలను ఆర్పేశారు. పీటీ పేలడంతో మండల వ్యాప్తంగా గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధిక ఉష్ణోగ్రతలతోనే పీటీ పేలిపోయి ఉండొచ్చని విద్యుత్ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 27: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి అడ్మినిస్ట్రేటర్ లావణ్య, కౌన్సిలర్ కల్పన అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేట, లక్ష్మీపురం, నర్సింగాపూర్ గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలతో శనివారం సమావేశమై ఆయా చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం అందించే ఐదురకాల సేవలను వినియోగించు కోవాలన్నారు. మహిళలు, బాలికల చట్టాలు, గృహహింస, బాల్య వివాహాల చట్టం, పోక్సో, సైబర్‌క్రైమ్ తదితర అంశాలను వివరించారు.

దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకోవాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 27: జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్యం అనేది ఓటుహక్కు ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. ఓటుహక్కు వినియోగించుకోవడానికి వీలుగా పీడబ్ల్యూడీ ఓటర్లు, మహిళలకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల వరకు వెళ్లలేని 85ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే వీలు కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీఎస్ నోడల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, సీడీపీవోలు మల్లీశ్వరి, స్వాతి,

మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయం

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



కేసముద్రం విలేజిలో మాట్లాతున్న సీతారాంనాయక్

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 27 : దేశానికి మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ జోస్యం చెప్పారు. కేసముద్రం విలేజిలో ఆ పార్టీ బూత్‌స్థాయి సమావేశం శనివారం మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ హయాంలోనే దేశానికి ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందని తెలిపారు. బీజేపీ గెలుపుఖాయం అయిపోయిందని 400 సీట్లకుపైగా గెలవబోతోందని, ఉద్యమకారులంతా తనకే మద్దతు పలుకుతున్నారని అన్నారు. బూత్‌కు ఐదుగురు చొప్పున కమిటీగా ఏర్పడి ఇంటింటికి కేంద్ర పథకాలను ప్రచారం చేయాలని, 10 రోజులు రేంబవళ్లు పనిచేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాలన్నీ సమగ్రంగా అభివృద్ధి చెందుతాయి. సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి నాయిని ధర్మారెడ్డి, వల్లభు వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ చైర్మన్ శశివర్ధన్‌రెడ్డి, గాంతి వెంకట్‌రెడ్డి, రడం వెంకన్న, తుంపిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పార్టీతోనే దేశాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్: జాతీయ పార్టీ బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో సీతారాంనాయక్ స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు దేశ శ్రేయస్సు కొరకు, దేశ రక్షణ, ప్రతిష్ట కోసం జరిగే ఎన్నికలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో అవినీతి రహిత పాలన కొనసాగించారని చెప్పారు. దేశ ప్రజలందరూ మళ్లీ మూడోసారి మోదీని ప్రధాని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, పార్లమెంట్ ప్రబారి నూకల వెంకటనారాయణరెడ్డి, వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోచ్‌ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 27: వేసవి ఉచిత శిక్షణ శిబిరాల నిర్వహణకు క్రీడా కోచ్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పది కేంద్రాల్లో మే 1 నుంచి 31 వరకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న కోచ్‌లు ఈనెల 29 సాయంత్రం 4 గంటల లోగా క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధన తరగతులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 27: రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో విల్‌టుకెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజులపాటు నిర్వహించే ఉచిత ఆన్‌లైన్ ఆంగ్లభాష బోధన తరగతులు శనివారం ములుగులోని లీలా గార్డెన్‌లో ప్రారంభయ్యాయి. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి తెలుగులో మాట్లాడినట్లుగా ఇంగ్లిష్ మాట్లాడే విధంగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని ఆయన అన్నారు.

ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్

(5వపేజీ తరువాయి)

మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు సుధీర్ కుమార్ హాజరయ్యారు. రెవరెండ్ పాల్సన్‌రాజ్, రెవరెండ్ జయప్రకాశ్‌రెడ్డిలు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని సుధీర్‌కుమార్‌ను ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులున్నారు.

వడ్డెపల్లి బండ్‌పై ప్రచారం

వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌తో కలిసి వడ్డెపల్లి బండ్‌పై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకింగ్ చేసేవారిని పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ తనకు ఓటు వేయాలని కోరారు. తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో నేతలు పత్తి సంపత్‌రెడ్డి, పుల్లయ్య, హరి, రాకేష్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌కుమార్‌ను ఆశీర్వదిస్తున్న రెవరెండ్ పాల్సన్‌రాజ్

పురుగుల మందుతాగి ఆత్మహత్య

కాటారం, ఏప్రిల్ 27: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాటారం జీపీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్యాల రాజయ్య (46), చిలుకమ్మ దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా వారికి వివాహం చేశారు. కూలి పని చేసి జీవించే రాజయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం బాగా తాగి పనికి వెళ్లకోవడంతో భార్య ప్రశ్నించగా ఆమెతో గొడవకు దిగి కొట్టేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడి కొడుతున్న క్రమంలో ఆమె పరుగెత్తుకుంటూ తెలిసిన వారింటికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న రాజయ్య పురుగుల మందు తాగాడు. చిలుకమ్మ కొద్దిసేపటికి ఇంటికి తిరిగి వచ్చేసరికి భర్త అపస్మారక స్థితిలో ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా రాజయ్య శనివారం మృతి చెందాడు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

(5వ పేజీ తరువాయి)

గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభు త్వం బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వమని అన్నారు. దేశంలో మత రాజకీయాలు చేస్తూ విద్వేషాలు సృష్టిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఏ నాయకుడైనా, కార్యకర్త అయినా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, ఎంపీటీసీ గుగులోత్ సునీత, నూనావత్ రాధ, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గంట సంజీవరెడ్డి, బండారు దయాకర్, వెంకన్న, కదిరె సురేందర్, వోలం రమేష్, రావుల మురళి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీనాయక్

కాంగ్రెస్‌లో చేరిక..

ఎమ్మెల్యే మురళీనాయక్ సమక్షంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుందర్ వెంకన్న కాంగ్రెస్‌లో చేరారు.

వరంగల్‌కు బీజేపీ చేసిందేమీ లేదు..

(5వ పేజీ తరువాయి)



విలేకరుల సమావేశంలో కావ్య

బీజేపీ ప్రచారకుడిగా మందకృష్ణ మారడాన్ని దళితులు గుర్తించారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మందకృష్ణ తన వద్దకు వచ్చి క్షమాపణలు కోరడం ఖాయమని కడియం శ్రీహరి కరాఖండిగా చెప్పారు.

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావువి దొంగ డ్రామాలని శ్రీహరి విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సవాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వీకరించిన క్రమంలో తప్పించుకునేందుకు హరీశ్‌రావు దొంగ దారులు వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలను ప్రస్తావించడం, స్పీకరు ఫార్మాట్‌లో రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలని కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంపై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని శ్రీహరి దుయ్యబట్టారు. కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే సరిపోతుందని కేసీఆర్ చెప్పడం తెలివి తక్కువతనమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ విషయాన్ని కేసీఆర్ చాలా తేలికగా తీసుకుంటున్నారని విమర్శించారు. కచ్చితంగా కేసీఆరే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయించిందే కేసీఆరే అని కడియం శ్రీహరి కరాఖండిగా చెప్పారు. ఆయన చేయమంటేనే అధికారులు చేశారని మీడియా ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. లేకుంటే వారు ఎలా ట్యాపింగ్ చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన పనికి అధికారులు బలి అయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జిల్లాల తగ్గింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు కడియం శ్రీహరి మీడియా ప్రశ్నకు జవాబిచ్చారు. ఈ క్రమంలో వరంగల్‌లో జిల్లాల తగ్గింపుపై కమిషన్‌కు తన అభిప్రాయాన్ని వివరిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 27: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలకే పరిమితమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. మే 13న జరుగున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదివారం సాయంత్రం హనుమకొండకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్నారని, ఈసందర్భంగా నిర్వహించే సభకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, జడ్పీటీసీ జోరిక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

కృష్ణకాలనీ (భూపాలపల్లి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావంతో తెలంగాణ ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారన్నారు. గడిచిన పదేళ్లలో అన్ని వర్గాలకూ మేలు జరిగేలా బీఆర్‌ఎస్ పరిపాలించిందని అన్నారు.